ఉగ్రవాదంపై అఖిలపక్ష సమావేశానికి ఎందుకు రాలేదు?

- 42 దేశాల్లో పర్యటించిన మీకు మణిపూర్ సందర్శించే తీరిక లేదా?
- పాక్‌పై యుద్ధంలో ట్రంప్ వ్యాఖ్యలు ఎందుకు ఖండించలేదు?
- ప్రధాని మోడీకి ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే సూటి ప్రశ్నలు
- మోడీ, అమిత్ షా ఢిల్లీని వదిలి పారిపోయే రోజులు వస్తాయంటూ హెచ్చరిక
- ఎల్బీ స్టేడియంలో సామాజిక సమరభేరి సభ
- ఎఐసిసి పిసి వేణుగోపాల్, సిఎం రేవంత్, మీనాక్షి నటరాజన్ హాజరు


సమరభేరీ సభలో మాట్లాడుతున్న మల్లికార్జున ఖర్గే

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉగ్రవాదంపై నిర్వహించిన అఖిలపక్ష సమావేశానికి ఎందుకు రాలేదు? 42 దేశాల్లో పర్యటించిన ప్రధాని మోడీకి మణిపూర్ సందర్శించే తీరికలేదా? ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ప్రశ్నించారు. దేశ ప్రజలను రోడ్ల పాలు చేసి విదేశీ నాయకులను కౌగిలించుకుంటున్న మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఢిల్లీ వదిలి పారిపోయే రోజు వస్తుందంటూ హెచ్చరించారు. టిపిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ అధ్యక్షతన శుక్రవారం హైదరాబాద్ లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన సామాజిక సమరభేరి సభకు టిపిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ అధ్యక్షత వహించారు. ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్, రాష్ట్ర ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ క్షేత్రస్థాయి నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రతిపక్ష పార్టీలతో సహా యావత్ దేశం ఒక్కటిగా నిలబడినప్పటికీ ఆపరేషన్ సిందూర్‌ను మధ్యలో ఎందుకు ఆపారని ప్రశ్నించారు. ఫహల్గాం ఉగ్రదాడి తర్వాత ఉగ్రవాదాన్ని అంతం చేస్తామంటూ పాకిస్తాన్‌పై యుద్ధం ప్రకటించిన సర్కార్ వెనుకడుగు వేసిందని విమర్శించారు. భారతదేశం, పాకిస్తాన్ మధ్య యుద్ధాన్ని తన మధ్యవర్తిత్వం ద్వారా ఆపానని అమెరికా అధ్యక్షులు ట్రంప్ చెబితే మోడీ ఖండించలేదని తప్పుపట్టారు. మోడీ మాటల మనిషే కానీ, చేతల మనిషి కాదని ఎద్దేవా చేశారు. పాకిస్తాన్‌పై యుద్ధంపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి హాజరు కాకుండా మోడీ తప్పించుకున్నారని గుర్తుచేశారు. మోడికి బీహార్ ఎన్నికల ప్రచారంపై ఉన్న ఆసక్తి దేశాన్ని కాపాడటంలో లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీపై అన్ని వైపుల నుంచి ఒత్తిడి వచ్చినా... లొంగకుండా బంగ్లాదేశ్‌కు స్వాతంత్ర్యం అందించారని గుర్తుచేశారు. దేశభక్తి అంటే ఇందిరాగాంధీ చూపించిన తెగువేనని అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం, అనంతరం దేశ నిర్మాణం కోసం కాంగ్రెస్, గాంధీ కుటుంబం అనేక త్యాగాలు చేసిందని తెలిపారు. నాడు, నేడు ఆర్ఎస్ఎస్, బీజేపీలు చేసిన త్యాగాలు ఏమైనా ఉన్నాయా? అని ప్రశ్నించారు. రాజ్యాంగంలో సోషలిజం, సెక్యులరిజం పదాలు లేకుండా చేస్తామనీ బీరాలు పలుకుతున్న బిజెపి తన పార్టీ చట్టంలో వాటిని కాపాడుతానని రాసుకుందని చదివి వినిపించారు. మోడీ సర్కార్ విదేశీ విధానం శత్రువులను పెంచే విధంగా ఉందని, ఇప్పటికే చైనా, పాకిస్తాన్‌తో శత్రుత్వం ఉందని గుర్తుచేశారు. ప్రస్తుతం నేపాల్ కూడా మనకు దూరంగా జరుగుతున్నదని చెప్పారు. ఫహల్గాం దుర్ఘటనపై ఏర్పాటు చేసిన అఖిల పక్ష సమావేశానికి ప్రధాని రాకపోవడం భావ్యమా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ హైదరాబాద్‌కు 50కి పైగా ప్రతిష్టాత్మక కేంద్ర సంస్థలను తీసుకొచ్చిందని తెలిపారు. ఈ నగరానికి బీజేపీ ఇచ్చిందేమిటని ప్రశ్నించారు.

పధాని మోడీ 42 విదేశాల్లో పర్యటించి అక్కడి రాష్ట్రపతులు, ప్రధానమంత్రులను కౌగిలించుకున్నారే తప్ప మణిపూర్‌లో చంపబడుతూ, నిత్యం ఏడుస్తున్న ప్రజలను పరామర్శించలేదని మల్లికార్జున ఖర్గే ఈ సందర్భంగా విమర్శించారు. తమ నేత రాహుల్ గాంధీ మణిపూర్‌ను సందర్శించి అక్కడి ప్రజలకు ధైర్యమిచ్చారని తెలిపారు. దేశవాసులను రోడ్లపై వదిలి విదేశాల్లో పర్యటించడం దేశభక్తా? అని ప్రశ్నించారు. మణిపూరి ప్రజలు ఈ దేశవాసులు కాదా? అని నిలదీశారు. మోడీ చెప్పేదొకటి చేసేదొకటిగా ఉంటుందనీ, ఈ దేశ ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు అందరం ఒక్కటిగా ముందుకు కదులుదామని ఖర్గే పిలుపునిచ్చారు.

తెలంగాణలో కెసిఆర్ ప్రభుత్వాన్ని కూలదోయం అసాధ్యమనీ, బిజెపి బలపడుతుందే తప్ప కాంగ్రెస్‌కు అవకాశం లేదన్న పరిస్థితులను హస్తం కార్యకర్తలు తారుమారు చేశారని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే ఆత్మ అని ప్రశంసించారు. వారే నాయకుల బలమన్నారు. అర్థబలం ఉండి, స్థిరంగా పాతుకుపోయినట్టు కనిపించిన గత బీఆర్ఎస్ సర్కార్‌ను, కేంద్రంలో అప్పటికే అధికారంలో ఉన్న బిజెపిని కాదని తెలంగాణ ప్రజలు కాంగ్రెస్సు గెలిపించారని వ్యాఖ్యానించారు. ఆ గెలుపులో కార్యకర్తల కష్టం ఉందని గుర్తుచేశారు. దాంతో రాష్ట్రంలో పేదలు, రైతులు, యువత, మహిళలు అన్ని వర్గాలు ఊపిరి పీల్చుకున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వారి కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని వివరించారు. కాంగ్రెస్ ఏం చెప్పిందో అదే చేస్తున్నదన్నారు. గిగ్ వర్కర్ల కోసం చట్టం రూపొందించామని తెలిపారు. విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో తెలంగాణ ప్రభుత్వం బాగా పని చేస్తుందని ప్రశంసించారు.

రాష్ట్రంలో కులగణన చేయటం ద్వారా దేశంలో అనివార్యంగా అందరూ కులగణన చేసే పరిస్థితిని కాంగ్రెస్ సృష్టించిందని తెలిపారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం కాంగ్రెస్ పోరాడుతోందని చెప్పారు. తమ పార్టీకి మరింత బలాన్నిచ్చి సామాజిక న్యాయ పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లాలని కోరారు. దాన్ని అందించడంలో వెనుకబడితే దేశానికి, ప్రజలకు నష్టమని హెచ్చరించారు. ఆ నష్టం జరగకుండా అందరం ఒక్కటై ముందుకెళ్దామని పిలుపునిచ్చారు.

బాలల హక్కులపై నేడు సదస్సు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బాలలను లైంగిక నేరాల నుండి రక్షించడం, వారి హక్కులు -వాయిస్ ఫర్ ది వాయిస్ లెస్ అనే అంశంపై శనివారం నుంచి రెండు రోజులపాటు హైదరాబాద్‌లో సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సుకు సుప్రీం కోర్టు న్యాయమూర్తి సూర్యకాంత్, సిఎం రేవంత్‌రెడ్డి, హైకోర్టు చీఫ్ జస్టిస్ సుజోయ్‌పాల్ హాజరు కానున్నారు. ఇందుకు సంబంధించి శని, ఆదివారాల్లో హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల సంస్థలో రాష్ట్ర స్థాయి స్టేక్‌హోల్డర్ల సదస్సు నిర్వహిస్తున్నారు.



నగరంలో పివిఆర్ ఐనాక్స్ మరో 4 స్క్రీన్లు ప్రారంభం

హైదరాబాద్ : నగరంలోని హఫీజ్‌నగరంలో ఎస్ఎంఆర్ వినయ్ మాల్‌లో ఆధునిక డిజైన్, ఆకర్షణీయమైన అంశాలతో 4-స్క్రీన్ థియేటర్‌ను పివిఆర్ ఐనాక్స్ ప్రారంభించింది. పట్టణ ప్రాంతాల్లో స్వీయ యాజమాన్యంలోని, ప్రీమియం సినిమా గమ్యస్థానాలలో పెట్టుబడి పెట్టాలనే కంపెనీ యొక్క నిరంతర నిబద్ధతకు ఇది నిదర్శనమని పివిఆర్ ఐనాక్స్ లిమిటెడ్ ఎండి అజయ్ బిజ్లి పేర్కొన్నారు. ఈ 4-స్క్రీన్ మల్టీప్లెక్స్ మొత్తం 849 సీట్ల సీటింగ్ సామర్థ్యాన్ని కలిగి ఉందన్నారు.

పిహెచ్‌డిసిసిఐ తెలంగాణ శాఖ ఏర్పాటు

- అధ్యక్షుడిగా గౌతమ్ జైన్ నియామకం

ప్రజాశక్తి - హైదరాబాద్



దేశంలోని ప్రముఖ వాణిజ్యవేత్తల సంఘం పిహెచ్‌డి చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (పిహెచ్‌డిసిసిఐ) తెలంగాణ శాఖను ఏర్పాటు చేసింది. దీనికి తొలి అధ్యక్షుడిగా పోకర్ణ గ్రూప్ సిఎండి గౌతమ్ చంద్ జైన్ నియమితులయ్యారు. స్టోన్ ఇండస్ట్రీ, ఫ్యాషన్ రంగంలో ఆయనకు 50 ఏళ్ల అనుభవం ఉంది. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో "భారత్-యుకె ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్" అంశంపై ఓ ఇంటరాక్టివ్ సెషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ ఎఫ్‌టిఎ ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని భారీగా పెంచుతుందని యుకె డిప్యూటీ హై కమిషనర్ (ఎపి, టిజి) గారెత్ విన్ ఓవెన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌డిసిసిఐ జాతీయ అధ్యక్షుడు హేమంత్ జైన్, డిజిఎఫ్‌టి సంయుక్త డైరెక్టర్ అజయ్ ఎస్‌సి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

విలీన గ్రామాల్లో 'ఉపాధి హామీ'ని కొనసాగించాలి

- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి నాగయ్య
- కలెక్టరేట్ ముందు ధర్నా, ఎఓకు వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మున్సిపల్‌లో విలీనమైన గ్రామాల్లో ఉపాధి హామీ పనులను, ఫీల్డ్ అసిస్టెంట్లను యధావిధిగా కొనసాగించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి నాగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం వ్యవసాయ కార్మిక సంఘం సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి అనంతరం ఎఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలంలోని తొమ్మిది గ్రామాలు, పటాన్‌చెరు మండలంలోని 11 గ్రామాలు మొత్తంగా 20 గ్రామాలు జిన్నారం, పటాన్ చెరు మున్సిపాల్టీల్లో విలీనం అవుతున్నాయన్నారు. ఈ గ్రామాల్లో గత 20 సంవత్సరాల నుంచి ఉపాధి హామీ పనులు నిర్వహిస్తూ 20 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు, సీనియర్ మెట్లు జీవనం సాగిస్తున్నారని, ఇప్పుడు వారి బతుకులు ఆగమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్‌లో ఉపాధి హామీ పనులు కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని, అడిగిన ప్రతివారికీ ఉపాధిహామీ పనులను కల్పించాలని డిమాండ్ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, సీనియర్ మెట్ల వయస్సు పై పడడంతో ఇంకోచోట వారికి పనులు దొరికే పరిస్థితి లేదని, వారందరికీ ప్రత్యామ్నాయ ఉద్యోగం కల్పించాలని కోరారు. జిన్నారం, పటాన్‌చెరు మండలాల్లో కార్మికులతోపాటు వారి కుటుంబ సభ్యులు మొత్తంగా 16000 మంది రోడ్డునపడే పరిస్థితి నెలకొన్నదన్నారు. పట్టణీకరణ పేరుతో గ్రామీణ పేదల పొట్ట కొట్టొద్దని ప్రభుత్వానికి సూచించారు. గ్రామాలు మున్సిపల్‌లో విలీనం అయితే పన్నుల భారం పడుతుందే తప్ప గ్రామీణ పేదలకు ఒరిగిందేమీ లేదన్నారు. కార్మికులందరికీ కేరళ ప్రభుత్వం మాదిరిగా మున్సిపల్ పట్టణాల్లో కూడా ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. పనులు కల్పించకుంటే కూలీలందరినీ సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.రామచందర్, ఎం.నర్సిములు, నాయకులు నరసింహారెడ్డి, రాజయ్య, అనిల్, సుజాత, శేఖర్, మమత వివిధ గ్రామాలకు చెందిన కార్మికులు పాల్గొన్నారు.

పరిహారం చెల్లించే వరకు పనులు చేయొద్దు

- జాతీయ రహదారి విస్తరణను అడ్డుకున్న రైతులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రోడ్డు విస్తరణలో కోల్పోతున్న భూములకు సంబంధించి ప్రభుత్వం పూర్తిగా పరిహారం చెల్లించే వరకు పనులు చేయొద్దని భూనిర్వాసితులు డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కొత్తగట్టు, గొల్లపల్లి రైతులు శుక్రవారం జాతీయ రహదారి పనులను అడ్డుకున్నారు. ప్రభుత్వం పరిహారం పూర్తిగా చెల్లించలేదని, పరిహారం చెల్లించే వరకు రహదారి పనులను ఆపాలని రైతు రాజేశ్వరరావు ఆధ్వర్యంలో రైతులు కాంట్రాక్టర్‌ను అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న ఎమ్మార్వో సురేఖ, ఎస్ఐ శేఖర్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకున్నారు. రైతు రాజేశ్వర్‌రావును అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.


రహదారి పనులను అడ్డుకుంటున్న రైతులు


యువజన సంఘాల నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

నిరుద్యోగులపై నిర్బంధం

- నాయకులను ముందస్తుగా అరెస్టు చేసిన పోలీసులు
- సచివాలయ ముట్టడికి డివైఎఫ్ఐ నేతలు యత్నం
- అడ్డుకుని అరెస్టు చేసిన ఖాకీలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిరుద్యోగ యువతపై రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధాన్ని ప్రయోగించింది. యువజన సంఘాల నాయకులను గురువారం సాయంత్రం నుంచే హైదరాబాద్‌తో పాటు వివిధ జిల్లాల్లో ముందస్తుగానే పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారు. అడుగడుగునా ఆంక్షలను విధించారు. నిరుద్యోగులు హైదరాబాద్‌కు రాకుండా నిఘా పెట్టారు. హైదరాబాద్‌లో ఉండే నాయకులను కూడా సచివాలయం వద్దకు వెళ్లనీయకుండా నిర్బంధాన్ని ప్రయోగించారు. ప్రభుత్వం, పోలీసుల నిర్బంధాన్ని ఛేదించుకుని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) నాయకులు సచివాలయ ముట్టడికి యత్నించారు. బిఆర్‌కెఆర్ భవన్ నుంచి ప్రదర్శనగా సచివాలయం వైపు వచ్చారు. అప్పటికే భారీగా మోహరించిన పోలీసులు డివైఎఫ్ఐ నాయకులను అడ్డుకున్నారు. ఈ సమయంలో తోపులాట, వాగ్వివాదం చోటుచేసుకుంది. సచివాలయంవైపు వెళ్లేందుకు యత్నించిన నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సమయంలో కొంతసేపు ఉద్రిక్తత జరిగింది. దొరికిన వారిని దొరికినట్టుగానే వాహనాల్లోకి ఎక్కించారు. అరెస్టు చేసి అఫ్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. జాబ్ క్యాలెండర్‌ను అమలు చేసి ఉద్యోగాల భర్తీ కోసం నోటిఫికేషన్లను విడుదల చేయాలని కోరుతూ నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం సచివాలయ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేశ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అరెస్టుల మీద పెట్టిన శ్రద్ధను జాబ్ క్యాలెండర్ అమలు, ఖాళీ పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ల విడుదలపై శ్రద్ధ పెట్టాలని డిమాండ్ చేశారు. ప్రజాపాలన పేరుతో అడుగడుగునా అక్రమ అరెస్టులు చేయడం దారుణమని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా యువజన నాయకులను ముందస్తు అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. నిరుద్యోగ యువతకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. కానీ ఇప్పటివరకు కేవలం గత ప్రభుత్వ నోటిఫికేషన్లతో కలిపి 55 వేల ఉద్యోగాలను మాత్రమే భర్తీ చేసిందని చెప్పారు. ఇంకా 1.45 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని అన్నారు. బీఆర్ఎస్ చేసిన తప్పులనే కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందన్నారు. ఉద్యోగాలను భర్తీకి నోటిఫికేషన్లను విడుదల చేయకుండా నిరుద్యోగులను మోసం చేస్తున్నదని విమర్శించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించేంత వరకు నిరుద్యోగ భృతి రూ.నాలుగు వేలు ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. నిధులు కేటాయించకుండా నిరుద్యోగులను నిర్లక్ష్యం చేస్తోందని చెప్పారు. యువతకు స్వయం ఉపాధి రుణాల కోసం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రారంభించిందని గుర్తు చేశారు. ఇప్పటి వరకు లబ్దిదారులను ఎంపిక చేయలేదనీ, రుణాలను మంజూరు చేయలేదని అన్నారు. ఎలాంటి షరతుల్లేకుండా రాజీవ్ యువ వికాసం పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. యూత్ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీల అమలుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సచివాలయం ముట్టడికి రాకుండా ఉండేందుకు డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్‌తోపాటు అన్ని జిల్లాల నాయకులు, కార్యకర్తలను సుమారు 220 మందిని పోలీసులు అరెస్టు చేశారని వివరించారు.

ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహిత్యంలోకి గ్రంథ ఆవిష్కరణ



ప్రజాశక్తి కల్చరల్

అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి రచించిన ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహిత్యంలోకి గ్రంథ ఆవిష్కరణ సభ శ్రీ త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళా వేదిక పై గాన సభ నిర్వాహణలో జరుగుతున్న ఇనాక్ సాహితీ సప్తహంలో భాగంగా జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కాశీ విశ్వేశ్వర రావు పాల్గొని గ్రంథాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఇనాక్ సాహితీ ప్రక్రియలపై పలువురు సాహితీ కారులు చేసిన రచనలు వారం రోజులుగా ఆవిష్కరించడం ఆయన ప్రతిభకు నిదర్శనమని అభినందించారు. ప్రముఖ సాహితీ వేత్త ఆదినారాయణ మాట్లాడుతూ ఇనాక్ సృజించనీ సాహితీ ప్రక్రియ లేదన్నారు. ప్రతి సాహితీ ప్రక్రియ సామాజిక హితం గా ఉంటుంది అని వివరించారు గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన సభలో పాలక వర్గ సభ్యుడు బండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నాట్య గురువు తేజస్విని శిష్య బందం ప్రదర్శించిన శాస్త్రీయ నత్య అంశాలు ఆకట్టుకున్నాయి.

రంగస్థలాంకిత జీవనుడు గరిమెళ్ల రామమూర్తి

ప్రజాశక్తి కల్చరల్



రంగస్థలమే శ్వాస గా జీవించిన కళా కారులు నాడు ఎందరో ఉన్నారని వారిలో గరిమెళ్ళ రామ మూర్తి ఒకరు అని పూర్వ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ రస రంజని వ్యవస్థాపక అధ్యక్షుడు హెచ్ జె దొర అన్నారు. తెలుగు విశ్వవిద్యాలయంలోని ఎన్‌టిఆర్ కళా మందిరంలో ప్రముఖ నాటక సంస్థ రస రంజని నిర్వాహణలో ప్రముఖ రంగస్థల ప్రయోక్త గరిమెళ్ల రామ మూర్తి జయంతి సందర్భంగా ఆయన పేరిట రంగస్థల పురస్కారం కిన్నెర సంస్థ స్థాపకుడు మద్దాలి రఘురాం కు ప్రదానోత్సవం సభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న దొర లాంఛనంగా రఘురాంకు పురస్కార ప్రదానం చేసి మాట్లాడారు. గరిమెళ్ల రామ మూర్తి రస రంజని సంస్థను ముందుకు నడిపించడంలో క్రియా శీలకంగా వ్యవహరించారని గుర్తు చేశారు. రంగస్థలంలోని అన్ని శాఖలలో గరిమెళ్లకు పూర్తి అవగాహన ఉందని వివరించారు. అధ్యక్షత వహించిన రాస రంజని అధ్యక్షులు డాక్టర్ కెవి రమణ మాట్లాడుతూ తొలి రెండవ ప్రపంచ తెలుగు సమావేశాలు విజయవంతం కావడంలో గరిమెళ్ల విశేష కృషి చేసారని వివరించారు. గరిమెళ్ల రామ మూర్తి పేరిట పురస్కారం అందుకున్న రఘురాం కిన్నెర సంస్థ నిర్వాహకుడుగా సంగీత నృత్య నాటక సాహిత్య రంగాల వారికి వేదిక కల్పిస్తు తెలుగు సంస్కృతి సాంప్రదాయ ప్రాచుర్యముకు తనవంతు సహకారం అందిస్తున్నారని ప్రశంసించారు. వేదికపై సినీ నటుడు సుబ్బరాయ శర్మ, సాహితీ వేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం, నాటక రచయిత విజయ భాస్కర్, తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంత రావు తదితరులు రఘురాంను అభినందించారు ఈ సందర్భంగా సాయి ఆర్ట్స్ కొలకలూరి వారిచే మాధవ్ రచించిన జనరల్ బోగీలు నాటిక గోపరాజు విజయ్ దర్శకత్వంలో ప్రదర్శించారు.

కూకట్‌పల్లి నెక్సస్ మాల్‌లో మలబార్ గోల్డ్ షోరూం ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్



దేశంలోనే అతిపెద్ద అభరణాల రిటైల్ చెయిన్ మలబార్ గోల్డ్ అండ్ డైమాండ్స్ కూకట్‌పల్లిలోని నెక్సస్ హైదరాబాద్ మాల్‌లో తమ కొత్త షోరూంను ఏర్పాటు చేసింది. దీనికి ముఖ్య అతిథిగా మలబార్ గ్రూప్ చైర్మన్ ఎంపి అహ్మద్, మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ఇండియా ఆపరేషన్స్ ఎండి ఒ అషర్ హాజరై లాంచనంగా ప్రారంభించారు. 3,200 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ కొత్త షోరూంను అందుబాటులోకి తెచ్చింది. దీంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రీజన్లో మలబార్ 44వ అవుట్‌లెట్‌లకు విస్తరించినట్లయ్యింది.

ఉద్యోగాలు అడిగితే నిర్బంధిస్తారా?

- డివైఎఫ్ నాయకుల అరెస్టుకు సిపిఎం ఖండన

హైదరాబాద్ బ్యూరో : జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలనీ, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగ, యువజన సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన ఆందోళనా కార్యక్రమంలో ఎక్కడికక్కడ అరెస్టులు చేయడాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ ఖండించింది. అరెస్టు చేసిన వారిని తక్షణమే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మొదటి ఏడాదిలోనే రూ.2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామంటూ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఇప్పటి వరకు కేవలం 56 వేలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుందని తెలిపారు. జాబ్ క్యాలెండర్ అమలు పరుస్తామంటూ హైదరాబాద్ డిక్లరేషన్‌లో హామీ ఇచ్చిందని పేర్కొన్నారు. నిరుద్యోగ భృతి నెలకు రూ.4 వేలు ఇస్తామని హామీ ఇచ్చిందని తెలిపారు. రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు.

అసెంబ్లీ మీడియా అడ్వైజరీ కమిటీ చైర్మన్‌గా శ్రీనివాస్‌రెడ్డి

- సభ్యులుగా ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్య
- 15 మందితో కొత్త కమిటీ నియామకం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో


శ్రీనివాస్‌రెడ్డి

తెలంగాణ అసెంబ్లీ మీడియా అడ్వైజరీ కమిటీని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పొలిటికల్ ఎడిటర్ ఐరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి చైర్మన్‌గా మరో 14 మందితో కమిటీని నియమిస్తూ శాసన మండలి, శాసనసభ కార్యదర్శి డాక్టర్ వి.నర్సింహ్మాచార్యులు ఉత్తర్వులు ఇచ్చారు. కమిటీ కో చైర్మన్‌గా ఎన్‌టివి రిపోర్టర్ పి.పరిపూర్ణాచారి, సభ్యులుగా నవతెలంగాణ స్పెషల్ కరెస్పాండెంట్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజెఎఫ్) ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య నియమితులయ్యారు. అలాగే అయితరాజు రంగారావు, బి.పూర్ణచందర్‌రావు, ఎల్.వెంకట్‌రాంరెడ్డి, పి.ఆంజనేయులు, ఎం.పవన్‌కుమార్, బి.అశోక్, బి.ఆంజనేయులుగౌడ్, సురేఖ అబ్బూరి, ఎండి నయీమ్ వజాహత్, ప్రమోద్‌కుమార్ చతుర్వేది, సుంచు అశోక్, బిహెచ్ఎంకె గాంధీ తదితరులు సభ్యులుగా నియమితులయ్యారు. 2025-27 సంవత్సరాలకు ఈ కమిటీ పనిచేస్తున్నది. అసెంబ్లీ మీడియా వ్యవహారాలు, జర్నలిస్టులకు పాసుల జారీ, విధి విధానాల ఖరారు తదితర బాధ్యతలను మీడియా అడ్వైజరీ కమిటీ నిర్వహించనుంది.

సామాజిక న్యాయాన్ని సమాధి చేసిన కాంగ్రెస్

- మధుసూదనాచారి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సామాజిక న్యాయాన్ని కాంగ్రెస్ సమాధి చేసిందని శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ అద్భుత పాలన జరుగుతుందని ఖర్గే చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఎస్‌సి, ఎస్‌టి డిక్లరేషన్‌లో ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా అమలు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 1970, 1980 ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వంలో సగం మంది మంత్రులు ఒకే సామాజిక వర్గం వారనీ, సిఎంలు, గవర్నర్లు కూడా ఆ సామాజిక వర్గం వారే ఉండేవారన్నారు. దేశంలో మెజారిటీ వర్గాలకు అన్యాయం చేసిందే కాంగ్రెస్ పార్టీ అని తెలిపారు. కులగణన తప్పుల తడకగా జరిగిందని చెప్పారు. రేవంత్ రెడ్డి రాసిచ్చిన స్క్రిప్ట్ చదివిన ఖర్గే ఒకసారి వాస్తవ పరిస్థితులను పరిశీలించుకోవాలని సూచించారు.

కాంగ్రెస్ దోపిడీకి అక్షయపాత్రగా తెలంగాణ

- సామాజిక న్యాయానికి తూట్లు పొడిచేందుకే కాంగ్రెస్ సభ
- బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రాంచందర్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో: కాంగ్రెస్ దోపిడీకి అక్షయపాత్రగా తెలంగాణ మారిందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్‌రావు విమర్శించారు. సామాజిక న్యాయానికి తూట్లు పొడిచేందుకే కాంగ్రెస్ పార్టీ సభ పెట్టినట్టు ఉందని ఎద్దేవా చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆరు గ్యారెంటీలు, ఇతర హామీల అమలులో కాంగ్రెస్ సర్కారు విఫలమైందని పేర్కొన్నారు. బీసీలకు తీవ్ర అన్యాయం చేసి, ఎస్సీ,ఎస్టీలకు సంకెళ్లి వేసి ఇప్పుడు భీమ్ పేరుతో నాటకమాడుతున్నదనీ, జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదాలకు తూట్లు పొడుస్తున్నదని విమర్శించారు. న్యాయాన్ని, రాజ్యాంగ విలువలను ఖూనీ చేసింది కాంగ్రెస్ పార్టీనేనని ఆరోపించారు. గ్రామాభివృద్ధి పనులకు సంబంధించిన రూ.1200 కోట్ల బిల్లులు పెట్టడం, స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించకపోవడం గాంధీజీ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఏ మొహం పెట్టుకుని సభ నిర్వహి స్తోంది? ఇంకా దోచుకోవడానికి ఏం మిగిలింది? అని ప్రశ్నించారు. కర్నాటక, హిమాచల్ ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు కాంగ్రెస్ దోపిడీ కేంద్రాలుగా మారాయని వాపోయారు. కుల గణన పేరిట బిసిలకు అన్యాయం చేసి ముస్లింలను బిసి కోటాలో చేర్చడమే కాంగ్రెస్ సామాజిక న్యాయమా? అని నిలదీశారు. మాయ నినాదాలతో ప్రజలను మోసం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధోరణి అని విమర్శించారు.

సిఎం సొంత జిల్లాలో ప్రాజెక్టులకు బీటలు

- నిధుల కొరత.. పనుల్లో నిర్లక్ష్యం
- ప్రజాప్రతినిధుల వైఫల్యం వల్లే సాగునీటి సమస్య
- నిధులు కేటాయించి.. పనులు పూర్తి చేయాలి : జాన్‌వెస్లీ
- జూరాల గేట్లను పరిశీలించిన ఆ పార్టీ బృందం



జూరాల గేట్లను పరిశీలిస్తున్న సిపిఎం నాయకుల బృందం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిఎం సొంత జిల్లాలో నిధుల్లేక.. పనులు సాగక.. నిర్వహణ లేక ప్రాజెక్టులకు బీటలు బారుతున్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. ముఖ్యమంత్రిగా మహబూబ్‌నగర్ జిల్లా వాసి ఎనుముల రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత జిల్లా ప్రాజెక్టులకు ఒరిగిందేమీ లేదని, నిర్వహణ లోప భూయిష్టంగా ఉందని తెలిపారు. జూరాల గేట్ల నిర్వహణ పరిస్థితులను శుక్రవారం సిపిఎం నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. నిధులు లేక ప్రాజెక్టుల నిర్వహణ భారంగా మారిందని, ప్రతి ఏటా వేసవిలో రోప్‌లకు గ్రీసు పెట్టాల్సి ఉండగా డాంబర్‌తో సరి పెట్టడం అత్యంత దారుణమని చెప్పారు. గ్రీసు పెట్టకపోవడం వల్లే తుప్పు పట్టి రోప్‌లు తెగిపోతున్నాయని తెలిపారు. జూరాల ప్రాజెక్టు విషయంలో అధికారులు, కాంట్రాక్టర్ల వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్న చిన్న మరమ్మతులపై నిర్లక్ష్యం వహిస్తే పెనుముప్పు తప్పదని హెచ్చరించారు. పాలమూరు నుంచి ఎమ్మెల్యేగా గెలిచి ముఖ్యమంత్రి అయిన రేవంత్‌రెడ్డి ఈ జిల్లా ప్రాజెక్టులను వేగవంతం చేస్తారని అందరూ భావించారన్నారు. కాంగ్రెస్ అధికారం చేపట్టిన నాటి నుంచి నిధుల కేటాయింపులు అరకొరగానే ఉన్నాయని విమర్శించారు. నిర్లక్ష్యం కారణంగానే మూడు నెలల కిందట ఎస్‌ఎల్‌బీసీలో ప్రమాదం జరిగి ఎనిమిది మంది చనిపోయారని, వారి మృతదేహాలు కూడా బయటపడలేదని అన్నారు. ఇంతలోనే జూరాల గేట్ల రోప్‌వేల మొరాయింపు జరగడంపై ఆందోళన వ్యక్తం చేశారు.

పాలమూరు జిల్లాను సస్యశ్యామలం చేస్తామంటున్న సిఎం రేవంత్‌రెడ్డి.. జిల్లాకు రావాల్సిన 175 టిఎంసిల నీటిని ఎందుకు ఉపయోగించుకోవడం లేదని ప్రశ్నించారు. జూరాలలో పూడిక పేరుకుపోవడం వల్ల 9.896 టీఎంసీలకు కేవలం 5 టిఎంసిలే వాడుకుంటున్నామన్నారు. ఐదేళ్లకోసారి మార్చాల్సిన రోప్‌లను ఎందుకు తొలగించలేదని ప్రశ్నించారు. నిధుల కొరత, నిర్వహణ లోపం వల్ల ఏటా రెండు టిఎంసిల నీరు వృథాగా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ప్రాజెక్టులో పేరుకుపోయిన మట్టిని తొలగించి పూర్తిస్థాయిలో సాగునీరందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కర్నాటక రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి అక్కడి రైతులకు పరిహారం చెల్లించి జూరాల సామర్థ్యాన్ని పెంచాలన్నారు. ఈ పర్యటనలో ఆల్ ఇండియా కిసాన్ సభ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, సిపిఎం వనపర్తి జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, గద్వాల జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, నారాయణపేట జిల్లా కార్యదర్శి వెంకట్రాంరెడ్డి తదితరులు ఉన్నారు.

వలస కార్మికులు మనుషులు కారా?

- మృతదేహాలను అట్టపెట్టెల్లో తరలించడం దారుణం : కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిగాచీ ఫ్యాక్టరీ పేలుడులో చనిపోయిన వారి పట్ల రేవంత్‌రెడ్డి సర్కారు వ్యవహరిస్తున్న తీరు అమానవీయంగా ఉందనీ, అట్టపెట్టెల్లో మృతదేహాలను తరలించడం దారుణమని బిఆర్‌ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు కల్వకుంట్ల తారకరామారావు విమర్శించారు. వలస కార్మికులు మనుషులు కారా? అని ప్రశ్నించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పరాయి రాష్ట్రం నుంచి తెలంగాణకు ఉపాధి కోసం వచ్చి చనిపోయిన కార్మికుల మృతదేహాలకు కనీస గౌరవం ఇవ్వలేరా? అని నిలదీశారు. యాభైకిపైగా కార్మికులు చనిపోతే అక్కడకెళ్లి రేవంత్‌రెడ్డి ఫొటో షూట్ చేశారని దెప్పిపొడిచారు. కోవిడ్ సమయంలో దేశంలోని ఏ రాష్ట్రం కూడా వలస కార్మికులను పట్టించుకోకపోతే ఆనాటి ముఖ్యమంత్రి కెసిఆర్ వాళ్లను అక్కున చేర్చుకున్నారని గుర్తుచేశారు. రేషన్, వైద్య సదుపాయంతో పాటు స్వస్థలాలకు వెళ్లడానికి వారికి ఉచిత రవాణా సదుపాయాన్ని ఏర్పాటుచేశారనీ, వారి ఆత్మగౌరవం దెబ్బతినకుండా చూశారని ప్రస్తావించారు. రాష్ట్రాభివృద్ధిలో వలస కార్మికులు వాటాదారులనీ, వాళ్లకూ సమాన హక్కులున్నాయని తెలిపారు. సిగాచీ పేలుడు తర్వాత ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవడంలో విఫలమైందని విమర్శించారు. తమ కుటుంబ సభ్యుల వివరాల కోసం బాధితులు పోలీసుల కాళ్లమీద పడుతున్న ఘటన బాధాకరమని పేర్కొన్నారు. ప్రమాదం జరిగినప్పుడు ఎంత మంది కార్మికులు పనిచేస్తున్నారన్న దానిపై కచ్చితమైన సమాచారం లేదని విమర్శించారు. ఎస్‌ఎల్‌బిసి టన్నెల్ కూలిన ఘటనలో చనిపోయిన ఎనిమిది మంది మృతదేహాల కోసం ఇప్పటికీ వారి కుటుంబసభ్యులు ఎదురుచూస్తున్నారనీ, వారికి పరిహారం ప్రకటించలేదని ఎత్తిచూపారు.

రైల్ రోకోకు న్యాయవాదుల మద్దతు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ జాగృతి, యుపిఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 17న పిలుపునిచ్చిన రైల్‌రోకోకు న్యాయవాదుల మద్దతు తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షులు కల్వకుంట్ల కవితతో న్యాయవాదులు ఆమె నివాసంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ జాగృతి లీగల్ సెల్ కన్వీనర్ నరేందర్ యాదవ్ ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్‌ను కవిత ఆవిష్కరించారు.

ఫీజుల విడుదల కోసం ఎస్ఎఫ్ఐ ఉద్యమం

- నేటి నుంచి ఏడు వరకు రాష్ట్ర వ్యాప్త పోరాటం
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రజనీకాంత్, నాగరాజు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాలేజీ విద్యార్థులకు అమలు చేస్తున్న ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాల బకాయిలు భారీగా పెరుకుపోయాయనీ, వీటిని విడుదల చేయటంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రజినీకాంత్, టి నాగరాజు, ఆ సంఘం కేంద్ర కమిటీ సభ్యురాలు పూజ విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వారు విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఇదే అంశంపై శనివారం నుంచి సోమవారం వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన, ఆందోళన పోరాట కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రజనీ కాంత్, నాగరాజు మాట్లాడుతూ... రాష్ట్రంలో గడిచిన ఆరేండ్ల నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్స్, స్కాలర్ షిప్‌లు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. ఏండ్ల తరబడి పెండింగ్‌లో పెడితే కాలేజీల నిర్వాహణ, విద్యార్థుల భవిష్యత్ ఆగమైపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు, ప్రయివేటు యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. వడ్డీలు తెచ్చి మేం విద్యాసంస్థలను నడపలేమంటూ యజమాన్యాలు పరీక్షలను బాయ్ కాట్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. మరో పక్క విద్యార్థులు నుండి పెండింగ్ ఫీజులను బలవంతంగా వసూళ్లు చేస్తున్నారని తెలిపారు అయినా ప్రభుత్వం పట్టనట్టుగా వ్యవహరిస్తున్నదని చెప్పారు. గత పాలకుల నిర్లక్ష్యాన్ని విమర్శించి కాంగ్రెస్..తాము అధికారంలోకొస్తే 'ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీ, ఇడబ్ల్యూఎస్ వర్గాల విద్యార్థులందరికీ ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు పాతబకాయిలు పూర్తిగా చెల్లిస్తాం' అంటూ ఎన్నికల ప్రణాళికలో హామినిచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రంలో 13 లక్షల మంది బడుగు,బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు పై చదువులకు వెళ్లాలంటే సర్టిఫికేట్ల కోసం కాలేజీలు చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. యాజమాన్యాలు ఫీజురీయింబర్స్‌మెంట్‌కు ముడిపెట్టటంతో వారు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని తెలిపారు. కొన్ని కళాశాలలు విద్యార్థులనుండి ముక్కు పిండి డబ్బులు వసూళ్లు చేస్తున్నాయని తెలిపారు.

ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా శనివారం మండల, పట్టణ, నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు, ధర్నాలు, 6న ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు, 7న జిల్లా కలెక్టరు కార్యాలయాల ముందు ధర్నాలకు పిలుపునిస్తున్నట్టు వెల్లడించారు. ప్రభుత్వం స్పందించి ఫీజులను విడుదల చేయాలని లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



బురదలో నిలబడి నిరసన తెలుపుతున్న విద్యార్థులు

రోడ్డు కోసం విద్యార్థుల రాస్తారోకో

- బురదలో నిలబడి నిరసన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం విద్యార్థులు రాస్తారోకో చేఆరు. కుమురంభీం- ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం భట్టుపల్లి-అందవెల్లి రహదారి మధ్యలో బురదలో నిలబడి నిరసన తెలిపారు. అందవెల్లి గ్రామ విద్యార్థులు భట్టుపల్లి ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్నారు. కానీ, వారు వెళ్లాల్సిన రోడ్డు పూర్తిగా గుంతలు పడి బురద నీటితో నిండిపోయింది. కాలి నడకన కూడా వెళ్లే పరిస్థితి లేకపోవడంతో విద్యార్థులు ఆందోళనకు దిగారు. దీంతో రోడ్డుకిరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఎంపిడిఒ కోట ప్రసాద్ అక్కడికి చేరుకొని విద్యార్థులతో మాట్లాడారు. రెండ్రోజుల్లో రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేపడతామని ఎంపిడిఒ హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.

చరిత్రను వక్రీకరించే వారిని కడిగేయాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి



దొడ్డి కొమరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జూలకంటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దొడ్డి కొమురయ్య రగిల్చిన విప్లవాగ్నితో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి అంకురార్పణ జరిగిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి తెలిపారు. ఆయన తెలంగాణ వేగుచుక్క, రేపటి వెలుగుల దివిటీ అని కొనియాడారు. దొడ్డి కొమురయ్య 79వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం ఆధ్వర్యంలో హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జూలకంటి మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో కొమురయ్య వీరోచితంగా పోరాడారని గుర్తు చేశారు. 60 గ్రామాల భూస్వామిని ఊరు నుంచి, గడీ నుంచి తరిమి కొట్టిన చరిత్ర దొడ్డి కొమరయ్యకుందన్నారు. ప్రపంచ చరిత్రలో పోరాట స్ఫూర్తిని చాటిన నిప్పుకణిక అన్నారు. వారి నిజ చరిత్ర వారసులుగా ఆయన గురించి భావి తరాలకు అందించడానికి "పల్లెలకు పోదాం -ప్రజలకు చెప్పుదాం.. చరిత్రను వక్రీకరించే కాషాయులను కడిగేద్దాం" అని పిలుపునిచ్చారు.

చెరిపేస్తే చెరిగే చరిత్ర కాదు..

ఎస్‌వికె కార్యదర్శి ఎస్.వినయకుమార్ మాట్లాడుతూ.. కమ్యూనిస్టులపై కక్షతో ఆనాటి కాంగ్రెస్ రజాకార్లను, భూస్వాములను చేరదీసి రైతాంగ సాయుధ పోరాటానికి ద్రోహం చేసిందన్నారు. కానీ ఆ పోరాటం చెరిపేస్తే చెరిగే చరిత్ర కాదని, ఎవరు వక్రీకరించినా తెలంగాణ ప్రజాకోర్టులో ద్రోహులుగా నిలబడతారని, చరిత్రను చరిత్రగానే చూడాలని వివరించారు. టీపీఎస్‌కే రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రజాకార్ సినిమాకు గద్దర్ అవార్డ్ ఇవ్వడంలోనే కాంగ్రెస్ కపటత్వం కనిపిస్తున్నదన్నారు. సాయుధ పోరాట నిజచరిత్రను సాంస్కృతిక యాత్రల ద్వారా.. ఆట పాటలతో ప్రచారం చేస్తామన్నారు. ఈ సందర్భంగా దొడ్డి కొమురయ్య అమరత్వ స్ఫూర్తితో భూ విముక్తి పోరాటం చెస్తామని అంతా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జానపద జెఎసి చైర్మన్ మురళీధర్ దేశ్‌పాండే, ఎస్‌వికె నాయకులు బుచ్చిరెడ్డి, ఎన్ సోమయ్య, టిపిడిఎల్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఐతగోని విజయ్, టిసిటిఎల్ఎఫ్ నాయకులు మహేష్ దుర్గే, యూనివర్సిటీ రిసెర్చ్ స్కాలర్ విద్యార్థులు పాల్గొన్నారు.

సుస్థిర మైనింగ్ విధానాలపై ప్రత్యేక దృష్టి

- అంతర్జాతీయ మైనింగ్ సదస్సులో కిషన్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సుస్థిర మైనింగ్ విధానాల అమలుపై దృష్టి సారించామనీ, గనుల తవ్వకాల్లో నిబంధనలను సరళీకరించడంతోపాటు సాంకేతికతను ప్రోత్సహిస్తామని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. వివిధ ఖనిజ పరిశ్రమలు తమ ఉత్పత్తులను పెంచాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ప్రకృతి, ప్రజల పట్ల బాధ్యతాయుతంగా మైనింగ్ ప్రక్రియను నిర్వహించాలని సూచించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ట్రైడెంట్ హోటల్లో వరల్డ్ మైనింగ్ కాంగ్రెస్ సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయి మైనింగ్ సదస్సు నిర్వహించారు. అందులో 8 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. పర్యావరణహిత, బాధ్యతాయుత మైనింగ్ అనే అంశంపై కిషన్‌రెడ్డి మాట్లాడారు. దేశ అవసరాలకు అనుగుణంగా తగినంత బొగ్గు, అల్యూమినియం, రాగి తదితర ఖనిజాలను ఉత్పత్తి చేసి, ఈ రంగాలలో దేశాన్ని స్వయంసమృద్ధి దిశగా నడిపించాల్సిన బాధ్యత పరిశ్రమలపై ఉందని చెప్పారు. గనుల తవ్వకం పూర్తయిన తర్వాత ఆ ప్రాంతాలను ప్రకృతికి, ప్రజలకు ఉపయోగపడేలా తీర్చిదిద్దుతామనీ, ఈ విషయంలో తమిళనాడు రాష్ట్రం దేశానికి ఆదర్శంగా ఉందని తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములుకు సతీవియోగం



ముత్యాలమ్మ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం, బిఆర్ఎస్ నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు సతీమణి ముత్యాలమ్మ గుండెపోటుతో గురువారం రాత్రి మృతిచెందారు. ఆమె మృతి పట్ల సిపిఎం, బిఆర్‌ఎస్ నాయకులు సంతాపం ప్రకటించారు. శుక్రవారం ఆమె భౌతికకాయాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు సతీమణి కొండిగారి ముత్యాలమ్మ రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నారు. వయో భారంతో ఆమెకు ఇంటి వద్దనే చికిత్స అందిస్తున్నారు. కాగా గురువారం అర్ధరాత్రి గుండెపోటు రావడంతో తుదిశ్వాస విడిచారు. సిపిఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సామెల్, పార్టీ సీనియర్ నాయకులు పి జంగారెడ్డి, ఏర్పుల నరసింహ, జిల్లా కమిటీ సభ్యులు బుగ్గరాములు, ఐద్వా జిల్లా నాయకులు మస్కు అరుణ, మున్సిపల్ కార్యదర్శి ఎల్లేష్ ఆమె భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలేసి నివాళులర్పించారు. బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ వెంకటరమణారెడ్డి, పార్టీ కార్యకర్తలతో కలిసి ముత్యాలమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పోచమోని కృష్ణ, కెవిపిఎస్ జిల్లా నాయకులు వీరేష్, బిఆర్‌ఎస్ నియోజకవర్గ యువ నాయకులు జెర్కొని రాజు, మడుపు శివసాయి, మాజీ కౌన్సిలర్లు శంఖర్‌నాయక్, ఆకుల సురేష్, కొండ్రు ప్రవీణ్, వరికుప్పల యాదగిరి పాల్గొన్నారు.



పెంచిన రైల్వే చార్జీలను తక్షణమే ఉపసంహరించుకోవాలి

- రైల్వే స్టేషన్ ఎదుట ప్రయాణికులతో కలిసి సిపిఎం ఆందోళన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారతీయ రైల్వే శాఖ ఇటీవల పెంచిన రైల్వే టికెట్ ఛార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం మహబూబాబాద్ జిల్లా గార్ల రైల్వే స్టేషన్ ఎదుట ప్రయాణికులతో కలిసి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందునూరి శ్రీనివాస్, మండల కార్యదర్శి అలువాల సత్యవతి మాట్లాడుతూ.. సాధారణ రైళ్లలో దూర ప్రయాణాలకు సెకండ్ క్లాస్‌లో కిలోమీటరుకు 1 పైసా చొప్పున, అన్ని ఎసి కోచ్‌లలో కిలోమీటరుకు రెండు పైసల చొప్పున ఛార్జీలు పెంచి రైల్వే ప్రయాణికులపై భారంమోపారని అన్నారు. సూపర్‌ఫాస్ట్ చార్జీలు, రైల్వే రిజర్వేషన్ల చార్జీలను యధావిధిగా ఉంచి, నిరంతరం పేదలు ప్రయాణించే రైళ్ల చార్జీలు పెంచడం ఎంతవరకు సమంజసమని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రైల్వే శాఖను ప్రయివేటుపరంచేసే కుట్రలో భాగంగానే చార్జీలు పెంచారని ఆరోపించారు. వెంటనే పెంచిన రైల్వే చార్జీలను రద్దు చేసి పేద, మధ్యతరగతి ప్రజలపై భారాన్ని తగ్గించాలని, లేకపోతే రైల్వే ప్రయాణికుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ అందోళనలో సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు విపి వెంకటేశ్వర్లు, ఎం.నాగమణి, మండల కమిటీ సభ్యులు సిహెచ్ ఎల్లయ్య, ఎ రామకృష్ణ, నాయకులు, రైల్వే ప్రయాణికులు పాల్గొన్నారు.

మత్తుకు బానిసలు కావొద్దు

- జీవితాలను నాశనం చేసుకోవద్దు : డిజిపి జితేందర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజల సౌకర్యార్థం అధునాతన సౌకర్యాలతో పోలీస్ స్టేషన్ భవనాలు నిర్మిస్తున్నామని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి) జితేందర్ అన్నారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలో రూ.10 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించే పోలీస్ స్టేషన్లకు పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గుర్నాథ్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, డిఐజి తాఫ్సీర్ ఎగ్బాల్, ఎస్‌పి నారాయణరెడ్డి, హౌసింగ్ ఐజీపీ రమేష్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డితో కలిసి పోలీస్‌స్టేషన్ ఆవరణలో శంకుస్థాపనలు చేశారు. కొడంగల్ పోలీస్‌స్టేషన్‌కు రూ.2.96 కోట్లు, సర్కిల్ పోలీస్ స్టేషన్‌కు రూ.84.50 లక్షలు, దుద్యాల పోలీస్ స్టేషన్‌కు రూ.మూడు కోట్లు, బొంరాస్‌పేట్‌లో రూ.2.96 కోట్ల వ్యయంతో నిర్మాణాలు చేపట్టే పనులకు భూమిపూజ చేశారు. అనంతరం డిజిపి మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మాదకద్రవ్యాల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

ఇతర రాష్ట్రాల నుంచి మాదకద్రవ్యాల తరలింపుపై ప్రత్యేక నిఘాతో దోషులను గుర్తించడంతోపాటు చట్టరీత్యా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు.

రెండు లారీలు ఢీ.. ఉవ్వెత్తున చెలరేగిన మంటలు

- సజీవదహనమైన ఇద్దరు డ్రైవర్లు, ఓ క్లీనర్
- మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలో ఘోర రోడ్డు ప్రమాదం



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రెప్పపాటులో మూడు నిండు ప్రాణాలు అగ్నికి ఆహుతయ్యాయి. ఎదురెదురుగా వస్తున్న రెండు లారీలు ఢీ కొని మంటలు చెలరేగి ఇద్దరు డ్రైవర్లు, ఓ క్లీనర్ మతిచెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఎల్లంపేట స్టేజీ సమీపంలోని జాతీయ రహదారి 563పై శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కి చెందిన సర్వణ్ రాం (23) చేపల దాణా కోసం విజయవాడకు వచ్చారు. దాణా అయిన అనంతరం తిరిగి బయలుదేరారు. ఇదే క్రమంలో వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం నల్లబెల్లి పరిధిలోని రాంనాథ్‌తండాకు చెందిన డ్రైవర్ గుగులోతు గణేష్ (30) కరీంనగర్ నుంచి గ్రానైట్ లోడ్‌తో కాకినాడ వెళ్తున్నాడు. కాగా, మహబూబా బాద్ జిల్లా మరిపెడ మండలం ఎల్లంపేట స్టేజీ సమీపంలో సర్వణ్ రాం లారీ అదుపు తప్పి ఎదురుగా గ్రానైట్ లోడ్‌తో వస్తున్న లారీని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మంటలు చెలరేగి డ్రైవర్లు గుగులోతు గణేష్, సర్వన్ రాం, క్లీనర్ బర్గత్ ఖాన్ (23) సజీవ దహనమయ్యారు. స్థానికులు స్పందించి పోలీసులకు సమాచారం ఇవ్వగా అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చినుకు పడితే చిత్తడే..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రేటర్‌లో చినుకు పడితే చాలు చిత్తడవుతోంది.. చిన్నపాటి వర్షం వచ్చినా పలు కాలనీలు నీట మునుగుతున్నాయి.. గట్టి వర్షం పడితే రోడ్లు కాలువలను తలపిస్తున్నాయి. ట్రాఫిక్ పద్మవ్యూహంగా మారుతోంది. దీంతో వాహనదారులు గంటల తరబడి రోడ్లపై ఇరుక్కుపోవాల్సిందే. గ్రేటర్ పరిధిలో ప్రతి వర్షాకాలం అస్తవ్యస్తమౌతుంది. చాలా ప్రాంతాల్లో ఇండ్లలోకి నీరు చేరుతోంది. గడిచిన మూడు నాలుగేళ్లలో భారీ వర్షాలు నగరవాసులను రోజుల తరబడి మురుగు నీటిలో ఉండేలా చేశాయి. అయినా జీహెచ్‌ఎంసీ అధికారుల తీరు ఆశించినంతగా మార్పు లేకపోవడంతో నగరవాసులు ఈ వర్షాకాలం గట్టెక్కేదెలా? అని ఆలోచిస్తున్నారు. ఇప్పటికే రెండ్రోజుల నుంచి నగరంలో కురుస్తున్న వర్షాలకు అతలాకుతలం అవుతోంది. ఇక వర్షాలు భారీగా పడితే పరిస్థితి ఎంటని నగరవాసులు భయాందోళనకు గురవుతున్నారు.

జోరుగా అక్రమ నిర్మాణాలు

నగరంలో జోరుగా అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. పార్కులు, ఖాళీ స్థలాలు, గుట్టలు, నాలాలను, చివరకు ఆలయాలను సైతం కబ్జా చేస్తున్నారు.